క్లుప్తంగా

రేపు వైకుంఠ ఏకాదశి



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఈ నెల 23న మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు, ధర్మకర్తలు తెలిపారు. దీనిని ముక్కోటి ఏకాదశిగా కూడా పిలుస్తారని చెప్పారు. 3 కోట్ల దేవతా మూర్తులు వైకుంఠ ద్వార దర్శనం కోసం ఎదురుచూస్తారని వెల్లడించారు. ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని పేర్కొన్నారు. శనివారం ఉదయం 6గంటలకు వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని, అనంతరం తిరుచ్చి ఉత్సవం, గీతా పారాయణం, తిరుప్పావై ప్రవచనాలు ఉంటాయన్నారు. ఆ తరువాత భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేస్తారని తెలిపారు.

ప్రత్యేక దర్శనం

పరిగి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల 23న పట్టణ కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7:30 గంటల నుంచి దర్శనం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

లక్ష్యం మేర మొక్కలు పెంచాలి

ఎంపీడీఓ రాఘవులు



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాఘువులు

మద్దూరు: మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లి పంచాయతీలో గురువారం ఎంపీడీఓ రాఘవులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం మొక్కలను పెంచాలని ఆయన సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే నర్సరీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధైర్యపడొద్దు..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: శాసనసభ ఎన్నికల్లో ఎదురైన ఓటమి వలన అధైర్య పడొద్దని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ బొంరాస్‌పేట, దుద్యాల మండలాల కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఓటమికి గల కారణాలను చర్చించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పట్టును కోల్పోరాదని. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని సూచించారు. నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌పాష, దేశ్యనాయక్, యాదగిరి, మధు యాదవ్, నరేశ్‌గౌడ్, మహిపాల్ ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అభిషేకం చేస్తున్న భక్తులు

దౌల్తాబాద్: మండల పరిధి కుదురుమళ్ల గ్రామంలో రాములు ఇంట్లో అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. గురువారం గురుస్వాముల ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ నిర్వహించి, అయ్యప్పకు అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. గురుస్వాములు దశరథ్, లాలు, నర్సింహులు, ప్రవీణ్‌గౌడ్, వెంకటయ్యగౌడ్ ఉన్నారు.

కంటింజెంట్ లీడర్ ఎంపిక

షాద్‌నగర్: జాతీయ సాహస క్రీడల శిక్షణ శిబిరానికి కంటింజెంట్ లీడర్‌గా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ నెల 30నుంచి జనవరి 8 వరకు షిమ్లాలో కేంద్ర వయోజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాహస క్రీడల శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం నుంచి క్రీడల శిక్షణకు కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాల నుంచి విద్యార్థులను ఎంపిక చేసిందని, ఈ క్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి 10మంది ఎంపికయ్యారని చెప్పారు.

సౌకర్యాలు సరే.. సడక్ ఏదీ?



పెద్దేముల్ మండల తట్టెపల్లి ఉన్నత పాఠశాల

- పొలం గట్లే విద్యార్థులకు బడిబాట
- రోడ్డు లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- సమస్య తీర్చాలంటూ విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్

కర్ణాటక సరిహద్దుకు మూడు కిలో మీటర్ల దూరం. గ్రామానికి కిలో మీటరు దగ్గర. చుట్టూ పరుచుకున్న పచ్చని పంటపొలాలు, చెట్లు. ఇంతటి ఆహ్లాదకరమైన ప్రాంతంలో కొలువుదీరిన సర్కారు బడిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. చదువుకోవటానికి విద్యార్థులకు అనువైన స్థలం ఉంది. అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని చందంగా.. బడికి వచ్చిపోయేందుకు సరైన మార్గంలేదు!.

పెద్దేముల్: తట్టెపల్లి గ్రామం.. మండలానికి సుమారు 12 కిలో మీటర్ల దూరంలో ఉంది. చుట్టూ అటవీ ప్రాంతం. గిరిజన తండాలతో చూడటానికి అందంగా ఉంటుంది. 16ఏళ్ల క్రితం ఇక్కడ పాఠశాల స్థాయిని పెంచారు. తరగతుల వారీగా స్థాయి పెరిగి, ఉన్నత పాఠశాలగా గుర్తింపు లభించింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు ఒకే చోటు కావడంతో గదులు సరిపడా లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో 6 నుంచి 10వ తరగతి వరకు గ్రామానికి కిలో మీటరు దూరాన ఐదెకరాల సర్కారు భూమిలో పాఠశాల భవనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆ పాఠశాలలో చుట్టు పక్కల పది గ్రామాలతో కలిపి సుమారు 160 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు.

పొలం గట్లే వారికి బాట..

విద్యార్థులు పది కిలో మీటర్ల దూరం నుంచి రావటం ఒకెత్తు. బస్సు దిగి పాఠశాలకు వెళ్లటం మరో ఎత్తు. బడి నిర్మించి పదేళ్లు దాటినా.. పాఠశాలకు వెళ్లేందుకు సరైన మార్గం కల్పించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిత్యం పొలాల గట్లపై నుంచి బడికి వెళ్తున్నామని, భయంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామ స్థాయి పాలకులు ఆరోపించడం గమనార్హం.

నిరసనలు చేసినా నిర్లక్ష్యమే,..

బడికి రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని, వానాకాలంలో తమ కష్టాలు చెప్పలేనివని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ బృందం తెలిపింది. రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, గ్రామస్తులు పలుమార్లు తట్టెపల్లి చౌరస్తా తాండూరు–జహీరాబాద్ ప్రధాన రహదారిపై నిరసనలు వ్యక్తంచేశారు. నాటి మంత్రులకు విన్నవించారు. అయినా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా ఉందని పేర్కొంటున్నారు.

ఇన్ని గ్రామాలకు ఇదే దిక్కు..

బండమీదిపల్లి, తట్టెపల్లి, జైరాంతండా, రచ్చకట్ట తండా, ఎర్రగోడుతండా, సిద్దన్న మడుగుతండా, పాషాపూర్, ఓంలానాయక్ తండాల పిల్లలకు ఇదే పాఠశాల దిక్కు.. ఇక్కడికే అందరూ వస్తారు. ఇంతమంది విద్యనభ్యసిస్తున్న విద్యాలయానికి సరైన మార్గం లేకపోవడం వారికి శాపమేనని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్థానికంగా రైతు వేదిక పక్కనుంచి జిల్లా అధికారులు రోడ్డు వేయించారు. కానీ అటుగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో విద్యార్థుల తల్లి దండ్రులు అటు నుంచి వెళ్లడానికి అయిష్టత చూపుతున్నారు. ఉన్న దారి మద్యం వ్యాపారానికి అడ్డాగా మారిందని, పొలాల మధ్య నుంచి మూడు అడుగుల దారి వదలడంతో విద్యార్థులు ఆ మార్గం గుండానే వెళ్తున్నారు. ప్రస్తుతం అది బాగానే ఉన్నా.. వానాకాలంలో రాకపోకలకు అనుకూలించదని స్థానికులు చెప్పారు. ఇదిలా ఉండగా.. పాఠశాలకు వెళ్లే మార్గంలో రైతుల పట్టా భూములు ఉన్నాయని, వారు కరుణించి స్థలం వదిలితే విద్యార్థులకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టి, రోడ్డు నిర్మించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

బాట లేక ఇబ్బంది..



వచ్చే విద్యార్థుల సమస్య పరిష్కరించాలి. బాట లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు మండల సమావేశంలో విన్నవించాం. అయినా ఫలితం శూన్యం. కొత్త ప్రభుత్వంలోనైనా పాలకులు స్పందించి, బడికి వెళ్లే రహదారి సమస్య తీర్చాలి.

–కొండాపురం రాములమ్మ, సర్పంచ్, తట్టెపల్లి

ఒక్కరు వెళ్లాలంటే భయం



గ్రామానికి బడి దూరంగా ఉంది. ఒక్కరు వెళ్లాలంటే పిల్లలు భయపడుతున్నారు. పొలం గట్లమీద నడవలేక పోతున్నారు. పాఠశాలలో అన్ని వసతులు ఉన్నా.. అక్కడికి వెళ్లే మార్గం లేదు. దారి కోసం పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించాం. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పందించి దారి సమస్య తీరిస్తే పిల్లలకు ఎంతో మేలు చేకూరుతుంది.

– శంకర్ నాయక్, ఎంపీటీసీ సభ్యుడు తట్టెపల్లి

అవమానించడం వారికి అలవాటే



వికారాబాద్ అర్బన్: నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

- ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్న ఇండియా కూటమి
- ఉప రాష్ట్రపతిని అవమానించిన ఎంపీలపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ నేతల డిమాండ్



కుల్కచర్లలో...

వికారాబాద్ అర్బన్: ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్‌ను అవమానించిన ఎంపీలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉప రాష్ట్రపతిని ఇండియా కూటమి ఎంపీలు అవమానించడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రం ఎన్టీఆర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న జగదీప్‌ను మిమిక్రీతో హేళన చేయడం దారుణమని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆ సన్నివేశాన్ని సెల్‌ఫోన్లో చిత్రీకరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఇలాంటివి చేయడం కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలకు అలవాటుగా మారిందని విమర్శించారు. తక్షణమే కల్యాణ్ బెనర్జీ, రాహుల్‌పై చర్యలు తీసుకోవాలని, లేని యెడలా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వారివి చిన్నపిల్లల చేష్టలు

కుల్కచర్ల: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌పై కాంగ్రెస్ నేతలు చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మాట్లాడారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై ఇష్టానుసారంగా మాట్లాడి అవమానించడం సరికాదన్నారు. మరోసారి బీజేపీ ప్రభుత్వం రాబోతుందని గ్రహించిన రాహుల్ గాంధీ.. చిన్నపిల్లల చేష్టలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వాటిని దేశ పౌరులు గమనిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, ప్రధాన కార్యదర్శి హన్మంతు, కోశాధికారి ఆంజనేయులు, నాయకులు సురేందర్, భీమయ్య, కాటనిపల్లి మైపాల్, కర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీల తీరుపై నిరసన

దౌల్తాబాద్: ఉప రాష్ట్రపతిని అవమానించేలా వ్యవహరించిన ఇండియా కూటమి ఎంపీల తీరును బీజేపీ నాయకులు తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ మాట్లాడారు. జగదీప్ ధన్కర్‌ను తృణమూల్ ఎంపీ అవమానించడం సిగ్గు చేటన్నారు. రాజ్యసభ నడవకుండా అడ్డుకోవడం మంచిది కాదని, ప్రజాస్వామ్యంపై గౌరవంలేని ఎంపీలను శాశ్వత అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, వెకటయ్య, మోహన్‌రెడ్డి, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

పది 'లక్ష్య'ం నెరవేరాలి

- ఉత్తమ ఫలితాలు సాధించాలి
- మండల విద్యాధికారి చంద్రప్ప



రాంపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ తదితరులు

బంట్వారం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. గురువారం స్టేట్ టీం సభ్యుడు సునందంతో కలిసి ఆయన కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి, రాంపూర్, కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతికి సంబంధించిన లక్ష్యపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడారు. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు తొలిమెట్టు, 6 నుంచి తొమ్మిది వరకు ఉన్నతి, పదో తరగతికి లక్ష్య అనే పేర్లతో విద్యాభ్యాసం జరుగుతోందని వివరించారు. ఈ ఏడాది పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే సంకల్పంతో ఉపాధ్యాయులు పని చేయాలని చెప్పారు. పని తీరుపై ఎప్పటికప్పుడు విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నామని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేస్తూ విద్యార్థులను ఉన్నతిగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ పల్లవి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీ నర్సింహులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థను కాపాడుకుందాం



దుద్యాల పాఠశాల ఆవరణలో మాట్లాడుతున్న వక్తలు

బొంరాస్‌పేట: సకల జనుల స్వేచ్ఛ కోసం భారత రాజ్యాంగం ద్వారా రూపొందించుకున్న న్యాయ వ్యవస్థను సమష్టిగా కాపాడుకుందామని న్యాయ విజ్ఞాన వేదిక సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పౌరహక్కులు, వాటిని కాపాడుకునేందుకు తయారు చేసుకున్న చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. హక్కులు, చట్టాలను కాపాడేందుకు న్యాయ, పోలీసు శాఖ ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కల ఎదుగుదలకు శ్రద్ధ చూపాలి



నర్సరీని పరిశీలిస్తున్న సర్పంచ్ బల్లరాణి

దోమ: నర్సరీలలో పెంచుతున్న మొక్కల ఎదుగుదలకు ఉపాధిహామి సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బల్లరాణి సూచించారు. మండల పరిధి లింగస్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం హరితహార కార్యక్రమంలో భాగంగా నర్సరీలను ఏర్పాటు చేసిందని చెప్పారు. వాటిల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతూ రైతులకు అందించడమే కాకుండా.. రోడ్లకు ఇరువైపులా నాటాలని సూచించారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

షాబాద్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకులు మధుసూదన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం ప్రతి గ్యారెంటీని అమలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, లింగం, కూర వెంకటయ్య, మాసయ్య, గౌరీశ్వర్ పాల్గొన్నారు.

పర్యాటక రంగం అభివృద్ధికి కృషి

- వరుస క్రమంలో దుకాణాల ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్‌తో చర్చించాకే సందర్శకులకు అనుమతి
- స్పష్టం చేసిన అధికారులు



ప్రాజెక్టు పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

ధారూరు: పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తూనే అటవీ పరిరక్షణకు బాధ్యతలు తీసుకుంటామని ఇరిగేషన్ ఈఈ సుందర్, జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సుచరితరెడ్డి అన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు మూసివేతపై కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే, సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి విన్నవించి, పర్యాటక రంగాన్ని పునరుద్ధరించి చిరువ్యాపారులను ఆదుకోవాలని కోరినట్లు తెలిసింది. స్పీకర్ సూచనతో గురువారం సాయంత్రం సుందర్, సుచరితరెడ్డి తదితర అధికార బృందంతో జలాశయాన్ని సందర్శించారు. అక్కడి సీసీ కెమెరాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అధికారుల రాక తెలుసుకున్న చిరువ్యాపారులు, బోటింగ్ నిర్వాహకులు సైతం ఆ ప్రాంతానికి వచ్చారు. అనంతరం అందరి సమక్షంలోనే ప్రాజెక్టు మూసివేత ఇతర అంశాలపై డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, ఫారెస్టు రేంజర్ కృష్ణ, సెక్షన్ ఆఫీసర్ రాజేందర్‌రెడ్డిలను వివరణ కోరగా.. వారి వెల్లడిస్తున్న క్రమంలో వ్యాపారులు అభ్యంతరం వ్యక్తంచేశారు.

పాతవారికే గుర్తింపు కార్డులు!

ప్రాజెక్టు వద్ద చెత్తా, చెదారం పేరుకుపోయి, నిప్పు పడి అడవి దహనానికి కారణమవుతుందని ఎఫ్ఆర్ఓ పేర్కొనగా.. అది అవాస్తవమని, బోటింగ్ నిర్వాహకులే చెత్తను సేకరించి జాగ్రత్తగా తగలబెడతారని కొందరు డీఎఫ్ఓ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎఫ్ఆర్ఓ మాట మార్చి, బోటింగ్ వద్ద సేఫ్టీ గార్డ్స్ ఉన్నారని, చిరు వాప్యారులు కట్టెల పొయ్యిలు వెలిగించరని, గ్యాస్ స్టౌవ్‌లే వాడతారని వెల్లడించినట్లు సమాచారం. అనంతరం డీఎఫ్ఓ మాట్లాడారు. కలెక్టర్‌తో అన్ని విషయాలు చర్చించిన తరువాతే పర్యాటకుల అనుమతి, తదితర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. చిరు వ్యాపారులను గుర్తించి, పాతవారికే గుర్తింపు కార్డులు వచ్చేలా చూస్తామని, ప్రాజెక్టు వద్ద వరుస క్రమంలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ వెంట మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సుచరితరెడ్డి, ఈఈ సుందర్, ఏఈ నవీన్, ఎస్ఓ రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు సమాచారం ఇచ్చాం

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: 'రాత్రికి రాత్రే నీటిని విడుదల చేస్తారా' అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు ఈఈ సుందర్ గురువారం స్పందించారు. ఎమ్మెల్యే సమయం ఇచ్చారని, కానీ ఆయన రావటం కాస్త ఆలస్యంగా అయిందని, అందుకే కార్యక్రమం మొదలు పెట్టే సమయానికి చీకటి పడిందని ఆయన పేర్కొన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వలకు నీటిని వదిలిపెట్టే విషయంలో పంట పొలాలకు ఎంతవరకు నీరు అందుతుందో పరిసర ప్రాంత రైతులు, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇచ్చామని ఆయన వివరించారు. కొందరు మద్యం తాగి వచ్చి, రాత్రిపూట అంటూ కొందరు, సమాచారం ఇవ్వలేదంటూ ఇంకొందరు గలాటా చేశారని తెలిపారు. గతంలో ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు కొంత డబ్బులు ఉండేవని, ప్రస్తుతం అవుట్‌సోర్సింగ్ వారికి జీతాలను 6 నెలల నుంచి ఇవ్వలేదని వెల్లడించారు. నీటి విడుదల విషయంలో పక్షపాతం లేదని ఈఈ స్పష్టంచేశారు.

ఆర్థిక సహాయం

యాలాల: హాజీపూర్ గ్రామానికి చెందిన రాములమ్మ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్.. గురువారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఉప సర్పంచ్ చంద్రప్ప, నర్సింహులు, సురేష్ తదితరులు ఉన్నారు.

చెడు వ్యసనాల బారిన పడొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

- రోడ్డు నిబంధనలు పాటించాలి: ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి

మర్పల్లి: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాని, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాల గురించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా ఆపద కలిగితే 100కు డయల్ చేయాలని చెప్పారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్, రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ పండరినాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

తాండూరు: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 31న రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ పోలీసులు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంత ఫంక్షన్‌హాల్స్, గోడౌన్స్, ఇతర స్థలాల్లో వేడుకలు నిర్వహించాలని అనుకుంటే, లిక్కర్ కోసం ఎక్సైజ్ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు.

ఇంట్లోనే ఉత్సవాలు..

పరిగి: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. పట్టణ కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ముందుస్తుగా సోదాలు చేపట్టామని చెప్పారు. న్యూఇయర్ వేడుకలు ఇంట్లోనే జరుపుకోవాలని సూచించారు. వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. బీమా, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మితిమీరిన వేగం, అజాగ్రత్త డ్రైవింగ్‌తో ప్రమాదాలు చోటు చేసుకుంటాయని, జాగ్రత్తగా నడపాలని సూచించారు.